గిరిజన పెద్దలను సత్కరిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్

షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి కృషి

జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయుచున్నారని, వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్ గిరిజనులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జన్ జాతీయ గౌరవ దివస్ వేడుకలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వాతంత్ర సమరంలో పాల్గొన్న గిరిజన నాయకుడు బిర్స ముండా, ఇతర గిరిజన నాయకుల చిత్రపటాలకు సంయుక్త కలెక్టర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న ప్రముఖ గిరిజన నాయకులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం నవంబర్ 15న జన జాతీయ గౌరవ దివస్ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. అందులోని భాగంగా జిల్లాలో గిరిజనులకు విశేష కృషి చేసిన వారిని సన్మానించినట్లు చెప్పారు. ప్రతి గిరిజనబిడ్డ విద్యను అభ్యసించాలని తెలిపారు. చదువుద్వారానే అభివృద్ధి సాధ్యం అన్నారు. గిరిజనులు వారి పూర్వీకులు నుంచి అందిపుచ్చుకున్న ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. అనంతరం గిరిజన పెద్దలు రామ నాయక్, కృష్ణ నాయక్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగప్రసాద్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



రబీలోనూ బీడే..!

◆ 2.18 లక్షల ఎకరాల్లో పడని విత్తనం
◆ కొనసాగిన వర్షాభావం
◆ అనంతలో 28 శాతమే సాగు
◆ సత్యసాయిలో తొమ్మిది శాతమే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రబీలోనూ కరువు పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణ సాగులో 28 శాతం కూడా రబీలోనూ సాగవలేదు. ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలు బీడుంటే, రబీలో 2.18 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. నైరుతి రుతుపవనాల తరహాలోనే ఈశాన్య రుతుపవనాల కాలంలో వర్షపాతం జిల్లాలో నమోదవ లేదు. దీంతో సాగు విస్తీర్ణం పడిపోయింది.

అనంతలో 28 శాతమే సాగు

అనంతపురం జిల్లాలో రబీ సాధారణ సాగు 3.04 లక్షల ఎకరాలు. ఇందులో 85750 ఎకరాల్లో సాగైంది. సాధారణ సాగులో 28 శాతమే సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో రబీ సాధారణ సాగు 72,097 ఎకరాలకుగానూ 12,599 ఎకరాల్లోనే విత్తనం పడింది. అంటే సాధారణ సాగులో తొమ్మిది శాతమే సాగైంది. ఇందులో రబీలో ప్రధాన పంట పప్పుశనగ. అనంతపురం జిల్లాలో ఈ పంట సాధారణసాగు 1.93 లక్షల ఎకరాలయితే 67,793 ఎకరాల్లోనే పప్పుశనగ పంట సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో ఆరు వేల ఎకరాలకుగానూ 1749 ఎకరాల్లో సాగైంది. వరి అనంతపురం జిల్లాలో 20 వేల ఎకరాల వరకు సాధారణంగా రబీలో సాగవుతుంది. కాని ఈసారి 1003 ఎకరాల్లో సాగైంది. మరో ప్రధాన పంట వేరుశనగ అనంతపురం జిల్లాలో 50 వేల ఎకరాలు. అయితే సాగైంది 3748 ఎకరాల్లో అయింది. సత్యసాయి జిల్లాలో 43,767 ఎకరాలకుగానూ 896 ఎకరాల్లోనే సాగైంది. ప్రధాన పంటల సాగు అన్నీ కూడా సాధారణ సాగు కంటే చాలా తక్కువగా అవడం గమనార్హం.

కొనసాగుతున్న వర్షాభావం

రబీలోనూ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతున్నాయి. ఖరీఫ్‌లో ఇప్పటికే కరువు మండలాల ప్రకటన జరిగింది. రబీలోనూ ఇదే వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం జూన్ నుంచి ఇప్పటి వరకు చూస్తే 438.7 మిల్లీమీటర్లు అయితే నమోదయిన వర్షపాతం 285.7 మిల్లీమీటర్లు. సాధారణం కంటే 34.9 శాతం వర్షపాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లాలో 501.2 మిల్లీమీటర్లకు గానూ 344.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఇక్కడ 31.3 శాతం వరర్షపాతం లోటుంది. అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే 23 మండలాల్లో వర్షాభావం నెలకొంది. అందులో శెట్టూరు మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 411.8 మిల్లీమీటర్లకుగానూ 146 మిల్లీమీటర్లు నమోదయింది. 64.5 శాతం లోటుంది. సత్యసాయి జిల్లాలో 25 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రొద్దంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 514 మిల్లీమీటర్లకుగానూ 197.7మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 61.6 శాతం లోటుంది. ఇలా ఖరీఫ్ లాగానే రబీ ఆశలు కూడా రైతల్లో ఆవిరవుతున్నాయి.

గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

దేవరపల్లిలో మౌలిక వసతులు కల్పిస్తాం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం దేవరపల్లి గ్రామంలో అన్ని మౌలిక వసతులనూ కల్పిస్తామని కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. బుధవారం నాడు హిందూపురం మండలం దేవరపల్లి గ్రామం వద్ద శ్యామ్ ఫెర్రస్ లిమిటెడ్, సర్వే నెంబర్ 67/2, 68/2, దేవరపల్లి గ్రామంలో ఎంఎస్ బిల్లేట్లు, టిఎంటి బార్‌ల తయారీ పరిశ్రమ విస్తరణ కోరకు ప్రజాభిప్రాయ సేకరణను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పివి.కిషోర్ రెడ్డి, ఎపిపిసిబి ఎఈఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవరపల్లి గ్రామంలో సిఎస్ఆర్ కార్యకలాపాలు ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అందించాలన్నారు. అర్హతల ప్రకారం స్థానికులకు ఉపాధి చూపాలన్నారు. దేవరపల్లి, చుట్టుపక్కల గ్రామాలను అభివద్ధి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, వివిధ స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

27 నుంచి కుల గణన : జేసీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అన్న అంశాలపై నవంబర్ 27 నుండి డిసెంబర్ 10 వరకు జిల్లాలో కులగణన కార్యక్రమం ఉంటుందని జిల్లా సంయుక్త కలెక్టర్ టీఎస్ చైతన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీకాన్ఫరెన్స్ హాల్ లో కుల గణన పై పవర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని జెసి తిలకించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో 27 నుంచి డిసెంబరు 10 వరకు కులగణన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. తహశీల్దార్లు మండల స్థాయిలో నోడల్ అధికారులుగా ఉంటారని తెలిపారు. వాలంటీర్ల ద్వారా ఈ కార్యక్రమం గురించి ఇంటింటికి తెలియజేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుల గణన చేపట్టాలని తెలిపారు. కులగణలలో వాలంటీర్లను ఉపయోగించుకోరాదని తెలియజేశారు. వాలంటీర్లను కేవలం కార్యక్రమం గురించి తెలియజేసేందుకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. కుల గణన గురించి ఇంటింటికి వెళ్లి సేకరించిన వివిధ అంశాలను ప్రత్యేకంగా తయారుచేసిన మొబైల్ యాప్ లో పొందుపరచాలని ఆదేశించారు. వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి కుల గణన గురించి పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు కూడా కులగణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలన్నారు. మండల, డివిజన్ స్థాయి శిక్షణ సమావేశాలు చేపట్టాలని తెలిపారు. సర్వేలో భాగంగా ప్రజల కులం, ఉపకులంతో పాటు పలు వివరాలను ప్రభుత్వం సేకరించనుందన్నారు.

తూతూమంత్రంగా మండలమీట్

ప్రజాశక్తి రొద్దం

మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమావేశానికి అధికారులు హాజరైనా సభ్యులు ఆశించిన స్థాయిలో హాజరుకాలేదు. అధికారులు జరిగిన పనుల గురించి సమావేశంలో వివరించారు. మండల వ్యాప్తంగా ఉన్న 19 మంది సర్పంచులు, 15 మంది ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు దాదాపు 40 మంది దాకా హాజరు కావాల్సుంది. అయితే సమావేశానికి పట్టుమని పదిమంది కూడా హాజరు కాలేదు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించేవారు లేకపోవటంతో సమావేశాన్ని రెండుగంటల లోపే ముగిచేశారు. అంతేకాకుండా ప్రోటాకాల్ ప్రకారం సింగిల్ విండో అధ్యక్షుడిని అధికారులు ఆహ్వానించలేదని నేలపై కూర్చుని నిరసన చేసిన ఆయన అనంతరం సమావేశం నుంచి బయటికి వెళ్లిపోయారు. ఎంపిపి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ, పలువురు సభ్యులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

16న ఎపిసిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ రాక

పుట్టపర్తి అర్బన్ : ఈ నెల 16న ఎపిసిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపిసిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ అనంతపురం జిల్లా నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి ఈ నెల 16న సాయంత్రం 5.30 గంటలకు లేపాక్షి దేవాలయాన్ని సందర్శిస్తారన్నారు. సాయంత్రం 7.30 గంటలకు పుట్టపర్తి ప్రశాంతి నిలయం చేరుకుంటారని చెప్పారు. ఆరోజు రాత్రి బస చేసి 17వ తేదీ ఉదయం 8 గంటల నుండి 9:30 గంటల వరకు శ్రీ సత్య సాయి సమాధిని దర్శించుకుంటారని తెలిపారు. 10 గంటల నుండి 11 గంటల వరకు కలెక్టరేట్‌లోని మీడియా ప్రతినిధులతో ఇంట్రాక్షన్ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు పుట్టపర్తి నుండి బయలుదేరి కదిరి ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుని అక్కడ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారని చెప్పారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా మదనపల్లి సమీపంలో ఆర్‌సి హిల్స్ బయలుదేరి వెళతారని జిల్లా కలెక్టర్ ప్రకటన లో తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం : కాంగ్రెస్

మడకశిర : వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సుధాకర్ అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని రోళ్ల మండలం బిజిహళ్లి పంచాయతీ పరిధిలోని టీడీపల్లి, మల్లిన మడుగు, కాలువేపల్లి, తదితర గ్రామాలలో ముందడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గౌడప్ప పాల్గొన్నారు.



ముందడుగు కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

బిసిలను విస్మరించిన వ్యక్తి చంద్రబాబు

ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో ఒక్కసారి ప్రజలు అవకాశం కల్పిస్తే, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివద్ధి చేస్తామని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, గుమ్మనూరు జయరాంలు తెలిపారు. బుధవారం నాడు హిందూపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి ఈ ప్రాంత ప్రజలు ఆ పార్టీకి పట్టం కడుతున్నారని చెప్పారు. నియోజకవర్గ అభివద్ధి మాత్రం జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై భరోసా పెట్టుకుని తమ పార్టీ అభ్యర్థి దీపికకు సంపూర్ణ మద్దతు తెలిపి, గెలిపించుకుంటే ఈ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివద్ధి చేస్తామన్నారు. బీసీల పార్టీ అని చెబుతూ, బీసీ ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు నాయుడు బీసీల కోసం చేసింది ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీసీలను గుర్తించి అత్యధికంగా మంత్రి పదవులు ఇవ్వడమే కాకుండా స్థానిక సంస్థల్లో సైతం అవకాశం కల్పించారన్నారు. ఐదు ఉపముఖ్యమంత్రి పదవుల్లో నాలుగు ఉప ముఖ్యమంత్రి పదవులను వెనుకబడిన వర్గాల వారికి కేటాయించారన్నారు. సమాజంలో ఉండే అన్ని వర్గాల అభివద్ధి కోసం సామాజిక సాధికార యాత్రను చేపట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో బాలకష్ణను ఓడించడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య, ఇన్‌ఛార్జి దీపిక, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటున్న సహకార సంఘాలు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పుట్టపర్తి సహకారసంఘం డిసిఒ కృష్ణ నాయక్ తెలిపారు. పుట్టపర్తి సహకార సంఘం అధ్యక్షులు రుషికేశవరెడ్డి ఆధ్వర్యంలో సహకార సంఘం 70 వ వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కృష్ణా నాయక్ మాట్లాడుతూ రైతులకు తక్కువ వడ్డీకే విధిగా రుణాలు కల్పించడంతో పాటు సబ్సిడీ ధరలతో ఎరువులు అందిస్తున్న సహకార సంఘాల సేవలు అభినందనీయమన్నారు. సహకార సంఘాలు అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, రమేష్, డిసిఎఒ రాజేంద్రప్రసాద్, రమేష్ బాబు, హరి, సీఈవో రవిశంకర్ రెడ్డి, సిబ్బంది నరసింహులు, లోకేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు 'బ్లూమూన్' విద్యార్థులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఈనెల 9, 10, 11న విజయనగరం జిల్లా పార్వతీపురంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కదిరికి చెందిన బ్లూ మూన్ విద్యార్థి విద్యార్థినులు ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ తెలిపారు. ఈ పోటీలలో బ్లూమూన్ కాలేజ్ విద్యార్థినిలు అండర్ 17 60 కేజీల కుమిత్ విభాగంలో పి.సిరి బంగారు పతకం సాధించగా ఎం.నికిత బాయ్-56 కేజీల కుమిత్ విభాగంలో స్వర్ణ పథకం సాధించింది ఈ నేపథ్యంలో వీరు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనపర్చడం సంతోషంగా ఉందని బ్లూమూన్ స్కూల్ చైర్మన్ మంచి శివశంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎస్‌జిఎఫ్ఐ సెక్రెటరీ సుగుణమ్మ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఆత్మగౌరవాన్ని నిలిపిన జగన్

◆ అభివృద్ధి తెలియని వ్యక్తి బాలయ్య ◆ సామాజిక సాధికార యాత్రలో మంత్రులు

ప్రజాశక్తి హిందూపురం

వెనకబడిన వర్గాల ఆత్మగౌరవం నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిదేనని వైసిపి నేతలు తెలిపారు. సామాజిక సాధికార బస్సుయాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం హిందూపురంలో అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ జరిగింది. అంతకు ముందు మంత్రులు, నాయకులు బహిరంగ సభ జరిగే సభాస్థలి వరకు రోడ్ షో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌ఛార్జి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, మంత్రి ఉషశ్రీ చరణ్, ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ గిరిజమ్మ, ఎంపీ గోరంట్ల మాధవ్, కర్నూల్ మాజీ ఎంపీ బుట్ట రేణుక, ఇతర జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకులా వాడుకున్న దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ది అన్నారు. వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవం నిలబెట్టిన ఘనత సీఎం జగనేకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ జెండా ఎగరావేయాలన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. వైఎస్.జగన్ హయాంలో ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగారన్నారు. జగన్ సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు మేలు చేశాయన్నారు. 30 లక్షల మంది మహిళలకు ఇంటి పట్టాలు ఇచ్చిన ఘనత జగనేదే అన్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు జగన్ ప్రభుత్వంలో నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. హిందూపురంలో 40 ఏళ్లుగా టీడీపీ నేతలే ఎమ్మెల్యేలుగా ఉన్నా, నియోజకవర్గానికి వారి చేసింది శూన్యం అన్నారు. బాలకష్ణను రెండు సార్లు గెలిపిస్తే హిందూపురం నియోజకవర్గాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరూ కలిసి హిందూపురంలో బాలకష్ణను ఓడించాలన్నారు. డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మైనారిటీలకు చంద్రబాబు ద్రోహం చేశారన్నారు. రాష్ట్రానికి ఒక మైనారిటీకి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే అన్నారు. హిందూపురం వైసిపి సమన్వయకర్త కురుబ దీపిక మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో నందమూరి బాలకష్ణ చుట్టం చూపుగా వస్తారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బాలకష్ణ హిందూపురం నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లాతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాధికార యాత్రలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా

వైసిపి హయాంలో వ్యవసాయానికి పెద్దపీట

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

గోరంట్ల రూరల్ : వైసిపి హయాంలో వ్యవసాయానికి పెద్దపీట వేశామని పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిచెరువు పల్లిలో రూ. 39 లక్షలతో చేపట్టిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల వ్యవసాయ గోడౌన్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. అదేవిధంగా కాలేకుంట్లపల్లిలో టిటిడి సహకారంతో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భజన మండలి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే గుత్తి వారి పల్లిలో రూ. 39 లక్షలతో చేపట్టిన 500 మెట్రిక్ టన్నుల వ్యవసాయ గోదాము నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందని అన్నారు. రైతులు ఆర్‌బికెలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, సర్పంచి వినోద్ కుమార్, ఎంపీపీ ప్రమీల మూర్తి, జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ బూదిలి వేణుగోపాల్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, తహశీల్దార్ రంగనాయకులు, మండల అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జడ్పీ కో ఆప్షన్ డాక్టర్ బాషా, మండల సచివాలయ సమరసింహారెడ్డి, వ్యవసాయ అధికారి మునికృష్ణ, సిఐ సుబ్బరాయుడు, గంగంపల్లి నాగభూషణ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రెడ్డిచెరువు పల్లి మాజీ సర్పంచి శ్రీనివాస్ రెడ్డి, సత్య నారాయణ, ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ పిఎం. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థి జిల్లాస్థాయిలో ప్రతిభ

ప్రజాశక్తి-మడకశిర

మండలపరిధిలోని పాపసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జిల్లాస్థాయిలో ప్రతిభ కనపర్చింది. పాఠశాలకు చెందిన సాయిలేఖన ఆర్డీటీ ఆధ్వర్యంలో జరిగిన రంగోలి పోటీల్లో జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. దీంతో ప్రతిభా విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహం ఏర్పాటుకు ఆర్థికసాయం

ఆర్థిక సాయం అందిస్తున్న సవితమ్మ

పెనుకొండ : నియోజకవర్గంలోని రొద్దం మండల కేంద్రంలో మాజీ మంత్రి రామచంద్రా రెడ్డి జ్ఞాపకార్థం అయన కుమార్తె టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ సవితమ్మ శ్రీభక్త కనకదాసు విగ్రహాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని సవితమ్మ కార్యాలయం వద్ద రొద్దం కురుబ సంఘం నాయకులకు విగ్రహదాత సవితమ్మ విగ్రహానికి సంబందించి సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కురుబలు సవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

తురకలాపట్నంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

రొద్దం : మండలంలోని తురకలాపట్నం గ్రామంలో టిడిపి నాయకులు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా వారు టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందే సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీలర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, గ్రామ కమిటీ అధ్యక్షులు రామగోపాల్, టీడీపీ సీనియర్ నాయకులు నాగభూషణ, టిఎన్ఎస్ఎఫ్ హరికృష్ణ, ఐటిడిపి మండల అధ్యక్షులు షణ్ముఖ, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి నాగేంద్ర, టైలర్ వెంకటరాముడు గాజుల గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు

మడకశిర : రాష్ట్ర మంత్రి రామచంద్రారెడ్డిని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహులు బుధవారం హిందూపురంలో కలిశారు. హిందూపురంలో చేపట్టిన బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నరసింహులు కలిశారు. ఈసందర్భంగా ఆయన తమ అనుచరులతో కలిసి మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే సీటు తనకు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పబ్లిసిటీ విభాగం జిల్లా అధ్యక్షులు చీపులేటి వెంకట రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగులూరి వెంకటేశ్వరరావుకు ఐకాన్ అవార్డు

వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి గోరంట్ల
మండలం లోని పాలసముద్రం సమీపాన గ్రాండ్ విల్లాస్ నిర్మించిన విఆర్ఎమ్ గ్రూప్ చైర్మన్ మాగులూరు వెంకటేశ్వర రావుకు ఐకాన్ అవార్డ్స్ 2023 రియల్ ఎస్టేట్ విభాగంలో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును బుధవారం దుబాయిలో అందుకున్నారు. విఆర్ఎం గ్రూప్ చైర్మన్ మాగులూరు వెంకటేశ్వరరావు పాలసముద్రం సమీపన జాతీయ రహదారి పక్కన గ్రాండ్ విలాస్ నిర్మించారు. అలాగే వందలాది మందికి ఉపాధి కల్పన చేస్తూ మండలానికి సుపరిచితులయ్యారు. మాగులూరి వెంకటేశ్వరరావు ఐకాన్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల మిత్రులు శ్రేయోభిలాషులు ప్రజలు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

సభ్యత్వ కిట్లు అందజేత

కదిరి టౌన్ : జనసేన పార్టీ కోసం కష్టపడుతున్న జనసైనికులకు 5 లక్షల రూపాయల బీమా అమలు హర్షణీయమని జనసేన పార్టీ మండల కన్వీనర్ రవీందర్ నాయక్ అన్నారు. గాండ్లపెంట మండల పరిధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలకు సభ్యత్వ కిట్లను బుధవారం పంపిణీ చేశారు.

వైసిపిని ఇంటికి సాగనంపుదాం : టిడిపి

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఈ నేపథ్యంలో వైసిపిని ఇంటికి సాగనంపుదామని 29వ వార్డు టీడీపీ కో ఆర్డినేటర్ కేశగాళ్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని 29వ వార్డులో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ 29వ వార్డు కో ఆర్డినేటర్ కేశగాళ్ల శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌ఛార్జి పూలకుంట్ల మహేశ్, బూత్ కన్వీనర్ తిరుపాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను అందజేయడంతో పాటు సూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ధర్మవరం టౌన్ : ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ పర్యవేక్షణ అధికారి డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కొత్తపేట బాలికల ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గురువారం ఐరన్ మాత్రలు వేస్తున్నారా అని హెచ్ఎంలను అడిగితెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందికుంట ఆధ్వర్యంలో తరలిన నాయకులు

కదిరి టౌన్ : పుట్టపర్తిలోని బ్రహ్మణపల్లి శ్రీనివాస కల్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన ఐక్య పోరాటం కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది కుంట అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

ఆలయంలో అన్నదానం

ధర్మవరం టౌన్ : బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యపాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించి సిద్దయ్యగుట్టలోని తిక్కస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానానికి విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నరేంద్రబాబు, ఉపాధ్యాయులు పోతలయ్య, ప్రభావతి, కళావతి, మారుతి పాల్గొన్నారు.

రైతుల నుంచి రాగుల సేకరణ

పెనుకొండ : మండలంలోని ఎర్రమంచి గ్రామ రైతుల నుంచి అధికారులు రాగులు సేకరించారు. గ్రామానికి చెందిన రైతుల దగ్గర నుండి 22 క్వింటాళ్ళు,దుద్దెబండ గ్రామ రైతుల నుంచి 12 క్వింటాళ్లు మొత్తం 34 క్వింటాళ్ల రాగులు సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిఎం అశ్వర్థ నారాయణ నాయక్, ఎడిఎ స్వయంప్రభ, ఎఒ శంకర్ నాయక్, ఇస్లాపురం సింగిల్ విండో అధ్యక్షులు సల్లా సూర్యప్రకాష్ రెడ్డి, పిఎసిఎస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి క్రికెట్ టోర్నీ

సోమందేపల్లి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పెనుకొండ నియోజకవర్గ వైసిపి నాయకులు రమాకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 21 నుండి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విన్నర్స్‌కు లక్ష రూపాయలు, రన్నర్స్‌కు 50 వేల రూపాయలు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడా జట్లు ఈనెల 18వ తేదీ లోపల వెయ్యి రూపాయలు ఎంట్రీ ఫీజు కట్టి జట్టు పేరును నమోదు చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సుధీర్ రెడ్డి 88858 51437, పృథ్వీ రాజ్ 8886766424, బాబా 9000469123 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన

రొద్దం : టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మండలంలోని తొడంగిపల్లిలో బుధవారం అనంత శక్తి సీఈవో లావణ్య అధ్యక్షతన తహసిన్ బి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలు, గృహహింస, వరకట్న వేధింపులు, తదితర వాటికి గురైనప్పుడు మహిళలు ఎవరిని సంప్రదించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మమ్మ, సొసైటీ న్యాయ సలహాకేంద్రకమిటీ సభ్యులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలకించారు... వెళ్లారు..!

పరిష్కారంపై మాట్లాడని మంత్రులు

ప్రజాశక్తి-హిందూపురం
పట్టణంలోని వివిధ వర్గాల వారితో బుధవారం నాడు పట్టణంలోని ఓ హోటల్‌లో వైసిపి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ అధ్యక్షతన మేదావుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, కర్నూల్ మాజీ ఎంపీ బుట్ట రేణుక, రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య, హిందూపురం ఇన్‌ఛార్జ్ దీపిక, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల వారిని వారి సమస్యలను వివరించాలని కోరారు. ముస్లీం మైనార్టీ నుంచి జామియా ముతవల్లీ నూరూల్లా గత ప్రభుత్వం నూతన జామీయ మసీదు నిర్మాణానికి రూ.2.50కోట్లు మంజూరు చేశారని, అయితే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదన్నారు. పట్టణంలో ఉన్న మైనార్టీ పాఠశాల అల్ హి లాల్ పాఠశాలను సాధ్యం అయితే ఎయిడెడ్ పాఠశాలగా మార్చాలన్నారు. అలా సాధ్యం కాని పక్షంలో మైనార్టీ సంక్షేమ శాఖ నుంచి పాఠశాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. ఈద్గా కోసం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. నాక్యయవాదుల సంఘం తరపున న్యాయవాది రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 1985లో హిందూపురం పట్టణానికి జిల్లా అదనపు న్యాయస్థానం ఏర్పాటు చేశారన్నారు. జిల్లా విభజన అనంతరం జిల్లా న్యాయస్థానాన్ని హిందూపురంలో ఏర్పాటు చేసే విధంగ చర్యలు తీసుకోవాలన్నారు. హిందూపురం నియోజక వర్గంలో వైసిపికి ఓటర్లు ఉన్నారని, అయితే నాయకుల మధ్య సమన్వయ లోపం ఉందన్నారు. దీనిపై పెద్దలు దృష్టి సారించాలన్నారు. వాల్మీకి సంఘం తరపున కోనపురం ఈశ్వరయ్య మాట్లాడుతూ వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. గుత్తి వద్ద ఉన్న వాల్మీకి గృహల అభివృద్ధితో పాటు వాల్మికి పీఠం ఏర్పాటు 10 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. రాయలసీమలో బలమైన సామాజిక వర్గం వాల్మీకులను రాజకీయాల్లో తగిన ప్రాధన్యత కల్పించి, వచ్చే శాసన సభ ఎన్నికల్లో తగిన సీట్లు కేటాయించాలన్నారు. చాంబర్ కామర్స్ తరపున బైసాని రాంప్రసాద్ మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ హిందూపురంలో ఉందని, ఇక్కడ తగిన విధంగా అభివృద్ధి జరగలేదన్నారు. అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. పరిపాలన పరంగా సబ్ డివిజన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాపురం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి పట్టు రైతులకు ప్రభుత్వం ఇవ్వాల్సి ప్రోత్సహకం రూ. 60 కోట్లు రావాల్సి ఉందన్నారు. దీనిని విడుదల చేయాలని ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వ పెద్దలను, మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డిని సమస్యలను వివరించినప్పటికి పసరిష్కారం కాలేదన్నారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని బతికించాలని కోరారు. శిల్క్ రీలర్స్ అసోసియేషన్ నాయకులు ముస్తఫా మాట్లాడుతూ ప్రభుత్వం రీలర్లకు ఇవ్వాల్సిన ప్రోత్సహకం రూ. 3.76కోట్లు విడుదల చేయాలని గత నాలుగు సంవత్సరాలుగ అడుగుతున్నప్పటికీ ఇప్పటి విడుదల చేయాలేదన్నారు. విశ్రాంత రైల్వే ఉద్యోగి ప్రసాద్ మాట్లాడుతూ పురం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను ఇప్పటి వరకు దళితులకు కేటాయించ లేదని, దళితులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అసంపూర్తిగ ఉన్నా కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించి, పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయా వర్గాలకు చెందిన వారు సదస్సులో కింద కుర్చోన్న మంత్రి పెద్ది రెడ్డి రామాయంద్రారెడ్డికి వినతులు ఇచ్చారు. సమస్యలను విన్న పెద్దలు వాటి పరిష్కారంపై మాటమాత్రమైనా మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో అక్కడికొచ్చిన వారంతా నిరాశతో వెనుదిరిగారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.

మేదావుల ఆత్మీయ సమావేశంలో సమస్యలను వివరిస్తున్న పట్టు రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి

వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం

టిడిపి, జనసేన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్
రాష్ట్రంలో వైసీపీ పాలనకు చమర గీతం పాడే సమయం ఆసన్నమైనదని టిడిపి, జనసేన సైనికులు 2024 ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం టిడిపి స్థానిక కార్యాలయంలో టిడిపి జనసేన సమన్వయ ఆత్మీయ నియోజకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అరాచక పాలన చేస్తున్నారని విమర్శించారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందా అంటే అది ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని అన్నారు. ఈ దుష్ట పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదన్నారు. పోలవరం ప్రాజెక్టును అటకెక్కించిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఉద్యోగులు నెల జీతం ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూసే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రాజకీయంగా అణిచివేయడానికి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని విమర్శించారు. ప్రధాన నాయకులను జైల్లో పెట్టి తిరిగి అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతున్నారన్నారు. వైసిపి పాలనలో సర్పంచులకు వచ్చిన నిధులను సైతం జగన్ వాడుకున్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా సాగునీరు, కియో పరిశ్రమ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ టిడిపి జనసేన ఉమ్మడిగా ఏర్పడి 2024 ఎన్నికలలో జగన్ పాలనను బంగాళాఖాతంలో కలుపుతామన్నారు. ఇప్పటి నుండే టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బచ్చల పుల్లయ్య, జిల్లా అధికార ప్రతినిధి సాలక్క గారి శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎల్ఐసి నరసింహులు, టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, రామాంజనేయులు, పుల్లప్ప, ఆరు మండలాల కన్వీనర్లు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు విష్ణు, నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, పూల శివ, మారుతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

జగన్ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

రాష్ట్ర వక్కలిగ సంఘం కన్వీనర్ పాండురంగప్ప

సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగప్ప

ప్రజాశక్తి మడకశిర
నాలుగున్నర ఏళ్ల జగన్ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర వక్కలిగ సంఘం కన్వీనర్ వి.ఎం. పాండురంగప్ప విమర్శించారు. సత్యసాయి జిల్లా కేంద్రం లోని శ్రీనివాస కల్యాణమండపంలో బుధవారం జిల్లాలోని కుల సంఘాలు, ప్రజా సంఘాలు, అఖిలపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాండురంగప్ప మాట్లాడుతూ బిసిలకు వైసీపీ ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ కార్పొరేషన్‌లో ఏ ఒక్కరికి సబ్సిడీ పథకాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ. 75 వేల కోట్లను దారి మళ్లించి బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. బిసిలకు తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే అందులో జగన్మోహన్ రెడ్డి 10 శాతం కోత విధించి 24 శాతం రిజర్వేషన్ కల్పించిన కారణంగా 16800 మంది బీసీలు అధికారం కోల్పోయారని విమర్శించారు. వక్కలిగులను ఒబిసిలో చేర్చడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుల, చేతి వృత్తులకు గత ప్రభుత్వం అందించిన ఆదరణ పని ముట్లను ఇవ్వకుండా నట్టేట ముంచారన్నారు. బీసీ నేతలపైన పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, ఉమ్మడి జిల్లా జోనల్ ఇన్‌ఛార్జి ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, రోళ్ల మండలానికి చెందిన నారాయణప్ప, జయరామప్ప, జిల్లా డైరెక్టర్ రవికుమార్, మండల రైతు సంఘం అధ్యక్షులు చంద్రప్ప, యువనాయకుడు మంజునాథ్, సీనియర్ నాయకులు హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పార్థుడి క్షమాపణతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్
పుట్టపర్తి పట్టణ సమీపంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో గందరగోళం నెలకొనగా తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి క్షమాపణతో వివాదం సద్దుమణిగింది. బుధవారం బ్రాహ్మణపల్లి లోని శ్రీనివాస కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జనసేన, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీలతో పాటు కుల సంఘాల నేతృత్వంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కర్నూలు జిల్లాకు చెందిన కెఇ కృష్ణమూర్తి తో పాటు శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కందికుంట వెంకటప్రసాద్, నిమ్మల కిష్టప్ప, గుండుమల తిప్పేస్వామి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బచ్చల పుల్లయ్య, సవితమ్మ అంబికా లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ కెటి. శ్రీధర్, గోరంట్ల లక్ష్మీనారాయణ, నరసింహులు, సామకోటి ఆదినారాయణ కుంటిమద్ది రంగయ్య, దూదేకుల సంఘం షేక్షావలి, మల్లెల జయరాం, జింక సూర్యనారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వడ్డెర కులానికి చెందిన నాయకులు మాట్లాడుతూ తమ కులానికి పార్టీలో రాజకీయంగా సముచిత స్థానం లభించలేదని, తమను ఓటు బ్యాంకు గా మాత్రమే వాడుకుంటున్నారని, ఈ విధానానికి చెల్లు చీటీ పాడి తమ కులానికి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన పార్థసారథి మాట్లాడుతూ గతంలో వడ్డెర కులానికి మండల జెడ్పీటీసీ స్థానం కల్పించగా పార్టీకి వెన్నుపోటు పొడిచి ఇతర పార్టీలోకి వెళ్లాడని ప్రస్తావించారు. దీంతో స్పందించిన వడ్డెర్లు తమ కులానికి చెందిన వారే వెన్నుపోటు పొడిచారని మాట్లాడడం సమంజసంగా లేదని, ఆ సమయంలో కూడా పలు కులాలకు చెందిన జెడ్పీటీసీలు పార్టీ మారలేదా అని ప్రశ్నించారు. దీంతో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. వెంటనే స్పందించిన పార్థసారథి తన మాటలతో ఎవరైనా బాధపడి ఉంటే క్షమించాలని కోరారు. దీనిపై కలగజేసుకున్న కదిరి టిడిపి సమన్వయకర్త కందికుంట వెంకటప్రసాద్ వడ్డెర సంఘం నేతలను శాంతింపజేశారు. అనంతరం కొద్దిసేపటి తర్వాత సభ యధాతథంగా జరిగింది. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ బీసీలకు నాలుగున్నర ఏళ్ల నుండి వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తోందని బీసీలకు వెన్నుదన్నుగా గతంలో ఎన్టీఆర్ ఇప్పుడు చంద్రబాబు నాయుడు ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా చేనేత, మత్స్యకార, రజక, దూదేకుల, నాయి బ్రాహ్మణ, వడ్డెర, పద్మశాలి, జింక, గాండ్ల, వాల్మీకి తదితర కుల సంఘా నాయకులు పాల్గొని ప్రసంగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న బికె.పార్థసారథి

గ్రంథాలయ వారోత్సవాలు

కొత్తచెరువులో..

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ అధికారి మూడే బొజ్జే నాయక్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శనను బుధవారం ఏర్పాటు చేశారు. పఠనాశక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి భాను, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజగోపాల్, ఉమామహేశ్వర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : విద్యార్థులు పుస్తక పఠనం చేయడం వల్లన విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం ధర్మవరంశాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం ముత్యాలప్ప, సిబ్బంది నాయక్, శివమ్మ, గంగాధర్, ముకుంద, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా రొద్దం గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నాగరాజు మాట్లాడుతూ చినిగిన చొక్కా తొడుక్కొని అయినా ఒక మంచి పుస్తకం కొనుక్కోవాలని తెలపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : గ్రంథాలయాల్లో పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఇఒ జయచంద్ర తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో రెండవ రోజు పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివయ్య చౌదరి, రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్, పాఠకులు సుబ్రమణ్యం, రాఘవ, మోహన్, అటెండర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే దేవాలయాలని మండల విద్యాశాఖ అధికారి బి. ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం గ్రంధాలయాల వారోత్సవాలు సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బి. వెంకటరత్నం, గ్రంథాలయ అధికారి ఆంజనేయులు, సాయిగీత, పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు లో భాగంగా. కదిరి గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాణిపేట స్కూలు లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనలో 110 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన ఎంఇఒ చెన్న క్రిష్ణకు, హెచ్ఎం జనార్ధనకు లైబ్రేరియన్ కృష్ణకిషోర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజనమ్మ, షమీలా, విద్యార్థులు, సిబ్బంది చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గుడికట్ల సంబరాలను విజయవంతం చేయండి

కొత్తచెరువు : కురుబల గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని. కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, గౌరవాధ్యక్షులు శివానంద, జనరల్ సెక్రెటరీ రమేష్ తెలిపారు. ఈనెల 19న అనంతపురంలో గుడికట్ల సంబరాలు నిర్వహిస్తున్నందున గ్రామాల్లోనే కురుబ సంఘం నాయకులు కురుబ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనివిజయవంతం చేయాలన్నారు, 250 గుడి కట్లను ఒకేరోజు ఒకే ప్రాంతంలో ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గుడికట్ల సంబరాల పోస్టర్లను కొత్తచెరువులో టీటీడీ కళ్యాణ మండపం ఆవరణంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు పవన్, ప్రభాకర్, కమ్మన్న, నారాయణస్వామి, కార్యదర్శి మల్లికార్జున, నాగరాజు, లక్ష్మీనారాయణ, నాగప్ప, కేసప్ప, సుబ్బయ్య, సూర్యనారాయణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ అందజేత

కదిరి టౌన్ : అక్టోబరు–2020లో ఆర్టీసీ డ్రైవర్ ఎంఎం. బాషా సర్వీసులో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆయన భార్య అమీదా బేగంకి ప్రావిడెంట్ ఫండ్ నుండి వచ్చిన ఇన్సురెన్సు మొత్తం రూ. 2.50 లక్షల విలువైన చెక్కును కదిరి డిపో అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్ అందించారు. ఎంఎం. బాషా కుమారుడికి కారుణ్య నియమకాల క్రింద ఉద్యోగము ఇచ్చేందుకు రికార్డులు సిద్దంగా ఉన్నాయని హరిమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమములో బాష కుటుంబ సభ్యులు అల్లాబకష్, ఆఫీసు సిబ్బంది అబ్బాస్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'బత్తల' ఆధ్వర్యంలో బస్సుయాత్రకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-కదిరి టౌన్
హిందూపురం లో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి నుండి వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సుమారు 30వాహనాల్లో వైసిపినాయకులు,కార్యకర్తలు తరలివెళ్లారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యను నాయకులు కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ బత్తల వెంకటరమణ, బత్తల గంగన్న, మాజీ పట్టణ అధ్యక్షుడు కెఎస్. బావొద్దీన్, ఏసు, దశరథ నాయుడు, రాంప్రసాద్, పురుషోత్తం రెడ్డి, ఫరూఖ్, చికెన్ జకీర్, నూర్, మస్తాన్, ముస్తాక్, మహబూబ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విమల సాహిత్య జాతీయ పురస్కారానికి 'జాబిలి'


జాబిలి చాంద్‌బాషా

ప్రజాశక్తి -పెనుకొండ
ఉపాధ్యాయుడు, కవి, రచయిత, సంపాదకుడు, సామాజిక సేవా కార్యకర్త జాబిలి చాంద్‌బాషా విమల సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు విమలా సాహితి ఫౌండేషన్ అధ్యక్షులు జెల్ది విద్యాధర రావు ప్రకటించిన్నట్లు జాబిలి తెలిపారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 19 వ తేదీ హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందుకోబోతున్నట్లు తెలిపారు. ఇరవై ఐదు సంవత్సరాలుగా జాబిలి చాంద్‌బాషా సాహితీ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ అనేక మంది సాహితీ కారులను ప్రోత్సహిస్తున్నారు. దేశభక్తి, పర్యావరణ పరిరక్షణ, మతసామరస్యం అంశాలపై విద్యార్థులను, సమాజాన్ని జాగృత పరుస్తున్నారు. మట్టిని ముద్దాడిన మనిషి, మిలన్, శాంతి పూలదేహం పుస్తకాలను రచించారు. అనంత సాహిత్యఅకాడమి, సత్యసాయి జిల్లా రచయితల సంఘాలకు అధ్యక్షులుగా ఉంటూ రాష్ట్ర జాతీయ స్థాయిలో అనేక కార్య క్రమాలు నిర్వహించి మెరుగైన సమాజం కోసం పాటుపడుతున్న జాబిలికి పురస్కారం దక్కడంపై జిల్లా రచయితల సంఘం సభ్యులు డాక్టర్ శివన్న, డాక్టర్ బాస్కర్ నాయుడు, మాణిక్యం ఇసాక్, ఉమర్ ఫారూక్, జయసింహ తదితరులు అభినందించారు.

యూనివర్సిటీ స్థాయి జట్టుకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్
యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు స్థానికవివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రిజ్వాన్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభ సభలో రిజ్వాన్ భాషా మాట్లాడుతూ యూనివర్సిటీ టీముకు ఎంపికైన విద్యార్థులు అంతర్ యూనివర్సిటీ లీగ్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభా విద్యార్థులను రిజ్వాన్ భాషా తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో కరీముల్లా, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అనువైన ప్రదేశంలో సొసైటీ గోడౌన్ నిర్మించండి

ముదిగుబ్బ : మంజూరైన సొసైటీ గోడౌన్‌ను అనువైన స్థలంలో నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నాగేంద్రకు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జొన్నల కొత్తపల్లి రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 51 లో కో-ఆపరేటివ్ సొసైటీ గోడౌన్‌ను నిర్మించతలపెట్టారని అయితే ఆ స్థలం వాగు లో ఉందన్నారు. భవిష్యత్తులో నష్టం కలిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కంటగాని నారాయణస్వామి, దేవేందర్ నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తలుపుల : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని వైసిపి మండల కన్వీనర్ ఫయాజ్ అహ్మద్, ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని సచివాలయం 3లో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జోనల్ అధ్యక్షులు డీకే బాబు, కన్వీనర్ అహ్మద్, ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, పురుషోత్తం రెడ్డి, ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, శకుంతల టోపీ రమణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-మడకశిర
బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం కేంద్రంలో మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల కళాశాలలో ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను ఆర్ డి టి సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుడిబండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథకం అధికారిణి పద్మావతి , ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్రరూపం దాల్చిందని అన్నారు. బాల్య వివాహాలు,బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని బాలలను కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ, ఏరియా టీం లీడర్ సావిత్రి, కళాశాల సిబ్బంది పద్మజ, ప్రమీల, అనురాధ, మమత, రాధమ్మ, పార్వతి, దుర్గమ్మ, లలిత, మంజుల, ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టపాసు పేలి బాలుడికి గాయాలు

ముదిగుబ్బ : మండలకేంద్రంలోని ఆంధ్రాబ్యాంక్ సమీపాన నివాసం ఉంటున్న ఒక కుటుంబానికి చెందిన బాలుడు టపాసులు కాల్చుతూ తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం మధ్యాహ్నం పటాసులు కాలుస్తున్న సమయంలో ఉన్నఫలంగా చేతిలోనే టపాసు పేలడంతో చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో బాలుడిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు.

పాఠశాలకు నీటి ట్యాంకు వితరణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్
మండలంలోని మల్కాపురం ప్రాథమిక పాఠశాలకు యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నీటిట్యాంకును వితరణ చేశారు. వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్తవంకదారి రామచంద్రగుప్త, కుమార్తెలు నీరజదేవి, షర్మిల, హేలనదేవి సహకారంతో పాఠశాల హెచ్ఎం చంద్రమోహన్‌కు నీటి ట్యాంకును వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, బిఆర్ రంగనాథ్, బండినాగేంద్ర, జయంతి వినోద్ తదితరులు పాల్గొన్నారు.